క్లుప్తంగా

ఎమ్మెల్యే గణేష్‌కు జిల్లా కమిటీ సభ్యుల కృతజ్ఞతలు



ఎమ్మెల్యే గణేష్‌ను సన్మానిస్తున్న పార్టీ జిల్లా కమిటీ సభ్యులు

నర్సీపట్నం: వైఎస్సార్‌సీపీ నూతన కమిటీ సభ్యులు స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌ను సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ జిల్లా కమిటీ కార్యదర్శులు బొడ్డు గోవిందరావు, సబ్బవరపు వెంకునాయుడు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు శానాపతి వెంకటరత్నం, ఉలబాల శ్రీను, కణితి అన్నపూర్ణ, కొణతాల వరలక్ష్మి, గంటా లలిత ఆయనకు జ్ఞాపిక అందజేసి పూలమాల, దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. జిల్లా కమిటీలో స్థానం కల్పించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పొలం గట్లపై మొక్కలతో అదనపు ఆదాయం



గట్లపై మొక్కలు నాటిస్తున్న ప్రకృతి సేద్య సిబ్బంది

మాకవరపాలెం: పొలం గట్లపై మొక్కలు పెంచడం ద్వారా అదనపు ఆదాయం పొందొచ్చని ప్రకృతి సేద్య సిబ్బంది సుదర్శన్, గణపతిలక్ష్మి రైతులకు సూచించారు. నారాయణరాజుపేటలో సోమవారం రైతులకు పంట రక్షణపై అవగాహన కల్పించారు. తెగుళ్ల నివారణకు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో తయారు చేసిన వివిధ కషాయాల తయారీ, పిచికారీ చేసే విధానాలను తెలియజేశారు. ప్రతి రైతు పొలం గట్లపై అరటి, ఇతర కూరగాయ పంటలను పెంచడం ద్వారా అదనపు ఆదాయం పొందొచ్చని సూచించారు. అనంతరం గట్లపై అరటి మొక్కలను నాటించారు. కార్యక్రమంలో ప్రకృతి సేద్య సిబ్బంది రమణమ్మ పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం



మంగళాపురంలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ పద్మరేఖ వెంకట్

కె.కోటపాడు/బుచ్చెయ్యపేట: అధిక పోషక విలువలున్న ఆహారం తీసుకుంటే, సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల మంగళాపురం సర్పంచ్ పద్మరేఖ వెంకట్ తెలిపారు. కె.కోటపాడు మండలం గొండుపాలెం, బుచ్చెయ్యపేట మండలం మంగళాపురం అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు, బాలింతలకు, కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. పోషక విలువలు ఎక్కువగా ఆకుకూరలు, పప్పుదినుసులతో కూడిన ఆహార పదార్థాల్లో ఉంటాయని తెలిపారు. వీటిని ఆహారంగా తీసుకోవడం వల్ల రక్తహీనత సమస్య బారిన పడకుండా ఉండొచ్చని వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో న్యాయవాదుల నిరసన



కోర్టు ముందు నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

నర్సీపట్నం: బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాది తగరం కృష్ణబాబుపై వీరపల్లి పోలీసులు అన్యాయంగా కేసు బనాయించడంపై సోమవారం పట్టణంలోని న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రావాడ సత్యనారాయణ మాట్లాడుతూ పోలీసులు పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల రక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ లోకా లోవరాజు, వైస్ ప్రెసిడెంట్ ఇట్టంశెట్టి సూరిబాబు, అనిమిరెడ్డి గోవిందు, న్యాయవాదులు పాల్గొన్నారు.

కె.కోటపాడులో భారీ వర్షం

కె.కోటపాడు: మండలంలోని చౌడువాడ, మల్లంపాలెం, గుల్లేపల్లి తదితర గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. కురిసిన భారీ వర్షంతో పొలాల్లోకి వర్షపునీరు పెద్ద ఎత్తున చేరుకోవడంతో వరి పంటకు ఉపకరిస్తుందని రైతులు చెబుతున్నారు.

ఉత్తమ గురువులకు పురస్కారం

- నేడు స్వీకరించనున్న ఉపాధ్యాయులు చింతల సూర్యారావు, రమణి
- ఉపాధ్యాయ సంఘాలు, ఎంఈవోలు అభినందన

విద్యార్థికి ఓనమాలు నేర్పి అతడి ఉన్నత భవిష్యత్తుకు సోపానం వేయడంలో ఉపాధ్యాయుల కృషి ఎనలేనిది. నిత్యం క్రమశిక్షణతో కూడిన విద్యా బోధన అందిస్తూ సన్మాన మార్గంలో నడిపిస్తుంటారు. అటువంటి గురువులను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ పురస్కారాలతో నేడు సన్మానించనుంది.



ఉత్తమ ఉపాధ్యాయుడు చింతల సూర్యారావు



ఉత్తమ ఉపాధ్యాయిని రమణి

దేవరాపల్లి: ఎన్.గజపతినగరం ఎంపీపీ పాఠశాల ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న చింతల సూర్యారావు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికయ్యారని ఎంఈవో-1, 2 పడాల్‌దాస్, ఉషారాణి తెలిపారు. జిల్లా స్థాయిలో ఉపాధ్యాయ దినోత్సవంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నుంచి అందుకుంటారన్నారు. గతంలో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న సూర్యారావు తాజాగా జిల్లా స్థాయి అవార్డుకు, కాశీపురం జెడ్పీ ఉన్నత పాఠశాల సాంఘికశాస్త్ర సహోపాధ్యాయుడు కొట్టాన రాంబాబు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపిక కావడం మండలానికే గర్వకారణమని ఎంఈవోలు తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలియజేశారు.

చోడవరం రూరల్: ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికైన పి.వి.రమణిని సోమవారం పలువురు సహ ఉపాధ్యాయులు అభినందించారు. పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (మెయిన్)లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయినిగా సేవలు అందిస్తున్న ఆమెకు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్వీకరించనున్నారు. విద్యార్థులతో స్నేహపూర్వకంగా ఉంటూ వారికి అర్థమయ్యేరీతిలో బోధన చేయడం, మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా నూతన బోధనా పరికరాలతో బోధన చేయడం రమణి ప్రత్యేకత. విద్యా బోధనలో ఆమె చూపుతున్న శ్రద్ధ, నిబద్ధతలకు ఉత్తమ అవార్డు దక్కింది. క్రమశిక్షణ, అకుంఠితదీక్ష, నిత్య విద్యార్థిని లక్షణాలు కలిగిన ఉపాధ్యాయినికి అవార్డు రావడం పట్ల మండల విద్యాధికారులు జయలక్ష్మి, సింహాచలంతో పాటు కాంప్లెక్సు ప్రధాన ఉపాధ్యాయులు రామిరెడ్డి, సీఆర్పీ కె.వి.ఎం.నాయుడు తదితరులు అభినందనలు తెలిపారు.

నేడు బీఎల్‌ఏలకు సమావేశం

రావికమతం: వైఎస్సార్‌సీపీ బూత్ లెవెల్ ఏజెంట్లకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ మండలాధ్యక్షుడు ముక్కా మహలక్ష్మినాయుడు సోమవారం తెలిపారు. విప్ కరణం ధర్మశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొని పలు సూచనలు చేస్తారన్నారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

నర్సీపట్నం ఆర్డీవో జయరాం



ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: స్పందన అర్జీలను వెనువెంటనే పరిష్కరించాలని ఆర్డీవో హెచ్.వి.జయరాం అధికారులను ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. డివిజన్ వ్యాప్తంగా 16 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో ఎక్కువగా భూసమస్యలు, హౌసింగ్, పింఛన్లు, సదరం సర్టిఫికెట్లకు సంబంధించినవి ఉన్నాయి. స్పందన ఫిర్యాదులను నిర్ణీత వ్యవధిలోపు పరిష్కరించాలని ఆర్డీవో మండల స్థాయి అధికారులకు సూచించారు. పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పటం సరికాదన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళా పాడి రైతులకు రుణాలు



మాట్లాడుతున్న ఎంపీపీ జగన్‌మోహన్

కె.కోటపాడు: పాడి రైతుల కుటుంబాల ఆర్థికాభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో అమూల్ డెయిరీలు ఏర్పాటు చేసి పాలకు మద్దతు ధర కల్పిస్తున్నారని ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ తెలిపారు. సోమవారం స్థానిక పశువైద్య కేంద్రంలో మహిళా పాడి రైతులతో సమావేశంతోపాటు రుణమేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అమూల్ డెయిరీల్లో పాలను పోసే మహిళా రైతులకు స్వల్ప, దీర్ఘకాలిక రుణాలను పీఏసీఎస్‌ల ద్వారా మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ రుణాలను నిర్ణీత కాలవ్యవధిలో పాల ద్వారా ఆదాయాన్ని పొంది తీర్చాలని వివరించారు. కె.కోటపాడు పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరక్టర్ జి.బైరాగి మాట్లాడుతూ రైతులకు 60 రాయితీపై టీఎంఆర్ దాణాను అందించడంతోపాటు పశు బీమా చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం వెంకటలక్ష్మి, డీసీసీబీ బ్రాంచ్ సూపర్‌వైజర్ వి.నరేష్, పీఏసీఎస్ సీఈవో ఆర్.చిన ఈశ్వరరావు, పశువైద్య కేంద్రం సిబ్బంది సమీరా పాల్గొన్నారు.

గోవాడ ఉప సర్పంచ్‌గా త్రివేణి ఎన్నిక

ప్రభుత్వ విప్ ధర్మశ్రీ అభినందన



ఉప సర్పంచ్ నక్కా త్రివేణిని అభినందిస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, చొక్కాకుల వెంకట్రావు



రమణమ్మను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చోడవరం: గోవాడ ఉప సర్పంచ్‌గా వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి నక్కా త్రివేణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాలకవర్గం ఏర్పడిన ప్రారంభంలో కుదిరిన ఒప్పందం ప్రకారం మొదటి రెండున్నరేళ్లు ఏడువాక వెంకట నాగేశ్వరరావు ఉప సర్పంచ్‌గా వ్యవహరించారు. ఆయన పదవీకాలం ముగియడంతో ఇటీవల రాజీనామా చేశారు. జిల్లా పంచాయతీ అధికారి నోటిఫికేషన్ మేరకు ఉప సర్పంచ్ ఎన్నిక సోమవారం జరిగింది. 12 మంది వార్డు మెంబర్లకుగాను సర్పంచ్, 10 మంది వార్డు మెంబర్లు వైఎస్సార్‌సీపీ బలపరిచిన నక్కా త్రివేణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏఎంసీ చైర్మన్ ఏడువాక సత్యారావు, సర్పంచ్ ఏడువాక అచ్చియ్యమ్మ సహకారంతో ఒప్పందం ప్రకారం 8వ వార్డు మెంబరు త్రివేణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన ఉప సర్పంచ్‌ను ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చొక్కాకుల వెంకట్రావు అభినందించారు. ప్రజా సంక్షేమ పాలన అందిస్తున్న ప్రభుత్వానికి ప్రజలంతా మద్దతు ఇవ్వాలని ధర్మశ్రీ కోరారు. గోవాడ పంచాయతీ పాలకవర్గ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

దిబ్బపాలెం ఉప సర్పంచ్‌గా రమణమ్మ

చీడికాడ: దిబ్బపాలెం ఉప సర్పంచ్‌గా దారపు రమణమ్మ సోమవారం ఎన్నికయ్యారు. రెండున్నరేళ్ల క్రితం జరిగిన పంచాయతీ ఎన్నికల్లో నూతన కార్యవర్గంలో వార్డు మెంబర్లు దారపు సత్యవతి, దారపు రమణమ్మ చెరో రెండున్నరేళ్ల పాటు ఉప సర్పంచ్‌గా పనిచేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. మొదటి రెండున్నరేళ్లు సత్యవతి ఉప సర్పంచ్‌గా కొనసాగగా, ఒప్పందం ప్రకారం ఆమె గడువు ముగియడంతో తాజాగా రమణమ్మను పాలకవర్గం ఎన్నుకుంది. వైఎస్సార్‌సీపీ మండల విభాగం అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, ఎంపీపీ కురచా జయమ్మ, జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాంతోపాటు మాజీ ఎంపీపీ దారపు సత్యనారాయణ అభినందించారు.

పూర్తిస్థాయిలో ఓటర్ల జాబితాలు పరిశీలించాలి

వైఎస్సార్‌సీపీ బీఎల్‌ఏల సమావేశంలో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



వైఎస్సార్‌సీపీ బీఎల్‌ఏల సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

చోడవరం: బూత్ స్థాయిలో ఓటర్ల జాబితాపై బూత్ లెవెల్ ఏజెంట్లు అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన చోడవరం మండలం బూత్ లెవెల్ ఏజెంట్లతో స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బూత్ లెవెల్ ఏజెంట్లకు ఇచ్చిన ఓటర్ల జాబితాను పూర్తిస్థాయిలో పరిశీలించాలన్నారు. దొంగ ఓటర్ల వివరాలను గుర్తించి రిటర్నింగ్ అధికారికి తెలియజేయాలన్నారు. అంతేకాకుండా ఓటర్ల జాబితాలో ఓటర్లను గుర్తించి, వారికి ప్రభుత్వ పథకాల అమలు తీరుపై తెలియజేయాలని సూచించారు. బూత్ లెవెల్ ఏజెంట్లు, సచివాలయ గృహసారథులు, కన్వీనర్లతో కలిసి పనిచేయాలన్నారు. పార్టీ సీనియర్ నాయకుడు చొక్కాకుల వెంకట్రావు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని చైతన్య పరచాలన్నారు. పార్టీని మరింత బలోపేతం చేయడానికి కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, డీఆర్‌యూసీ సభ్యుడు బొడ్డు శ్రీరామ్మూర్తి, మండల సచివాలయ కన్వీనర్ పతివాడ అప్పారావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగులాపల్లి రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షురాలు బొగ్గు శ్యామల, మండల అధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు పాల్గొన్నారు.

సన్యాసిపాత్రుడుకు జన్మదిన శుభాకాంక్షల వెల్లువ



సన్యాసిపాత్రుడుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ చైర్‌పర్సన్

నర్సీపట్నం: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడుకు పార్టీ నాయకులు, అభిమానులు, అధికారులు, పట్టణ వ్యాపారులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. తొలుత అభిమానులు, కుటుంబ సభ్యుల సమక్షంలో సన్యాసిపాత్రుడు జన్మదిన కేక్ కట్ చేసి, వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, డీసీసీబీ మాజీ చైర్‌పర్సన్ చింతకాయల అనిత, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి, కౌన్సిలర్ బేతిరెడ్డి రత్నం, దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ చెరుకూరి సత్యనారాయణ, అయ్యరక కార్పొరేషన్ డైరెక్టర్లు కర్రి కనకమహాలక్ష్మి, కర్రి శ్రీనివాసరావు, కర్రి రాంగోపాల్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు షేక్ రోజా, లగుడు స్వామి, గుడబండి నాగేశ్వరరావు, నూకాంబిక దేవస్థానం చైర్మన్ ధనిమిరెడ్డి నాగు, యూత్ అధ్యక్షుడు ధనిమిరెడ్డి ప్రసాద్ తదితరులు ఉన్నారు.

నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంటు శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీడీవో హనుమంతరావు

నాతవరం: నిరుద్యోగ యువతకు మూణ్నెల్ల పాటు ఉచితంగా స్కిల్ డెవలప్‌మెంటు శిక్షణ ఇవ్వనున్నట్టు ఎంపీడీవో హనుమంతరావు తెలిపారు. ఆయన సోమవారం తన కార్యాలయంలో అధికారులతో మాట్లాడారు. పదో తరగతి, ఆపై చదువుకున్న నిరుద్యోగులు గ్రామ సచివాలయంలో లేదా ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులకు ఆసక్తి ఉన్న కోర్సులపై ఉచితంగా శిక్షణతోపాటు భోజన వసతి సదుపాయం కల్పిస్తామన్నారు. వారి తల్లిదండ్రులకు ఉపాధి జాబ్‌కార్డు ఉంటే శిక్షణ కాలంలో స్టయిఫండ్ ప్రభుత్వం ఇస్తుందన్నారు. శిక్షణ అనంతరం ప్రైవేటు కంపెనీలో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఎంపీడీవో కార్యాలయం పరిపాలనాధికారి పోలుపర్తి పార్థసారథి, సీనియర్ అసిస్టెంటు ప్రసాద్, ఉపాధి ఏపీవో చిన్నరావు, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ చినబాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

40 శాతం రాయితీపై గడ్డి కోసే యంత్రాలు

తెనుగుపూడిలో ఇద్దరు రైతులకు పంపిణీ



గడ్డి కోసే యంత్రాలను అందజేస్తున్న ఉప సర్పంచ్ కాటిపాం పెదనాయుడు, పశువైద్యాధికారి అలేఖ్య

దేవరాపల్లి: గడ్డి కోసే యంత్రాలను 40 శాతం రాయితీపై ప్రభుత్వం అందజేస్తుందని మండల పశువైద్యాధికారి ఎస్.అలేఖ్య తెలిపారు. సోమ వారం తెనుగుపూడి ఆర్బీకే వద్ద పాడి రైతులు వూట ముత్యాలనాయుడు, అక్కునాయుడులకు ఉప సర్పంచ్ కాటిపాం పెదనాయుడుతో కలిసి ఆమె గడ్డి కోసే యంత్రాలను అందజేశారు. ఈ యంత్రం ద్వారా గడ్డిని ముక్కలుగా చేసి వేయడం ద్వారా పశువులకు సులభంగా జీర్ణమవుతుందని ఉప సర్పంచ్ తెలిపారు. గడ్డి వృథా కాదన్నారు. గడ్డి కోసే యంత్రం పూర్తి ధర రూ.33,790, ప్రభుత్వ సబ్సిడీ 40 శాతం పోను రైతు రూ.20,388 చెల్లించాలని మండల పశువైద్యాధికారి తెలిపారు. స్థానిక పశువైద్య సహాయకుడు కామిరెడ్డి మహేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు అండగా వైఎస్సార్ బీమా

దేవరాపల్లి: ఇంటి పెద్ద దిక్కు కోల్పోయిన బాధిత కుటుంబాలకు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన వైఎస్సార్ బీమా పథకం అండగా నిలుస్తుందని సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు తెలిపారు. బోయిలకింతాడలో మోపాడ తాతారావు మరణించగా, అంత్యక్రియల నిమిత్తం నామినీగా ఉన్న అతడి భార్య శ్యామలకు తక్షణ సాయంగా రూ.10 వేలు అందజేశారు. మిగిలిన సొమ్ము నామినీ ఖాతాలో జమవుతుందని ఆయన తెలిపారు. స్థానిక పాల సంఘం అధ్యక్షుడు అన్నం సాంబమూర్తి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాము, పంచాయతీ సెక్రటరీ జామి అప్పారావు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ పరశురాం, వెల్ఫేర్ అసిస్టెంట్ సత్యనారాయణ పాల్గొన్నారు.

పరిశ్రమలకు పరిమితంగా విద్యుత్ వినియోగం

నర్సీపట్నం: పెరిగిన విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని పరిశ్రమల యాజమాన్యాలు రోజువారీగా 70 శాతం మాత్రమే విద్యుత్తు వినియోగించుకోవాలని ఏపీఈపీడీసీఎల్ నర్సీపట్నం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ తెలిపారు. అధిక స్థాయి విద్యుత్ డిమాండ్, ప్రతికూల వాతావరణ పరిస్థితుల రీత్యా గృహ, వ్యవసాయానికి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు పరిశ్రమలకు పది రోజుల పాటు ఆర్అండ్‌సీ పద్ధతులను అమలు చేస్తున్నామన్నారు. పరిశ్రమలకు శనివారం పవర్ హాలిడేగా ప్రకటించామన్నారు. రోజూ ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఒక షిఫ్ట్‌లో మాత్రమే పరిశ్రమలను నడపాలన్నారు. ఈ నెల 5 నుంచి 15వ తేదీ వరకు పరిశ్రమల నిర్వాహకులు సహకరించాలని కోరారు.

అర్హతే ప్రామాణికంగా కొత్త పింఛన్లు



కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రామధర్మజ



పింఛన్ నగదును అందిస్తున్న సర్పంచ్ దొరబాబు



కేజీహెచ్‌లో దేముడుకు పింఛన్ ఇస్తున్న వలంటీరు పావని

మాడుగుల: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కృషితో మండలానికి 287 కొత్త పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీపీ వేమవరపు రామధర్మజ అన్నారు. సోమవారం ఆయన ఎంపీపీ కార్యాలయంలో కొత్త పింఛన్లు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉప సర్పంచ్ శ్రీనాథు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, వార్డు మెంబర్లు వేమన గణేష్, శీలామంతుల జ్యోతి పాల్గొన్నారు.

కె.కోటపాడు: లంకవానిపాలెంలో నూతనంగా మంజూరైన పింఛన్లను సోమవారం సర్పంచ్ వేచలపు దొరబాబు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా వర్తింపజేస్తున్నట్లు తెలిపారు.

డి.గొటివాడలో..

మాడుగుల రూరల్: డి.గొటివాడ గ్రామానికి నూతనంగా మంజూరైన పింఛన్లను సోమవారం సర్పంచ్ గోకాడ అర్జునరావు పంపిణీ చేశారు. ఇక్కడ ముగ్గురికి నూతన పింఛన్లు మంజూరైనట్లు సర్పంచ్ తెలిపారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ సచివాలయ కన్వీనర్ గోకాడ అప్పలనాయుడు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

మాకవరపాలెం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తూర్పుకాపు సంఘం మండల అధ్యక్షుడు గొంతిన హరిబాబు అన్నారు. తామరం సచివాలయంలో 12 మంది లబ్ధిదారులకు నూతన పింఛన్ల నగదును సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పింఛనుదారుడు మరణిస్తేనే, మరో వ్యక్తికి ఆ పింఛన్ ఇచ్చేవారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హతే ప్రామాణికంగా పింఛను ఇస్తున్నారన్నారు. ఈ తేడాను గుర్తించి మద్దతుగా నిలవాలని కోరారు. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ గోవింద్ పాల్గొన్నారు.

430 కొత్త పింఛన్ల పంపిణీ

మాకవరపాలెం మండలానికి కొత్తగా 430 పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీవో అరుణశ్రీ తెలిపారు. మొదటి విడతగా మండలంలోని వివిధ గ్రామాల్లో అర్హత ఉన్న 240 పింఛన్లు ఇప్పటికే నగదు రూపంలో పంపిణీ చేశామన్నారు. రెండో విడతగా మరో 190 పింఛన్లు నగదు మంగళవారం అందజేస్తామన్నారు.

విశాఖ వెళ్లి పింఛన్ల అందజేత

రావికమతం: తోటకూరపాలేనికి చెందిన యడ్ల దేముడుకు విశాఖ కేజీహెచ్‌లో వలంటీర్ లాలం పావని సోమవారం పింఛన్ అందజేసింది. అనారోగ్యంతో చికిత్స పొందుతున్న అతడికి వలంటీర్ పావని తన అన్న బాబులునాయుడుతో కలిసి పింఛన్ అందించి పలువురి మన్ననలు పొందారు.

మాడుగుల రూరల్: కె.జె.పురానికి చెందిన శ్రీనాథు లక్ష్మి అనారోగ్యంతో విశాఖలో ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. సోమవారం అక్కడకు వెళ్లి ఆమెకు గ్రామ వలంటీరు కాళ్ల జ్యోతి పింఛను అందజేసింది. సర్పంచ్ రమణబాబు, తదితరులు అభినందించారు.

చీడికాడ: వింటిపాలేనికి చెందిన లంక రాము అనారోగ్యానికి గురై విశాఖలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వలంటీరు లంక రాము అక్కడకు వెళ్లి పింఛన్ నగదు అందించాడు.